# గాలిపడగలు

శ్రీ కోశా బాలకృష్ణరావు

(గతసంచిక తరువాయి)

రోడ్డుమీద బస్సుదిగి, ఒక మైలునడిచి ఊళ్ళోకి వెళ్ళాలి. అప్పటికి సాయంత్రం ఏడుగంటలైంది.

ఆ సమయంలో, ఆ యింట్లో తన రాకకి ఎవరు ఎదురు చూస్తారు!

ఊరుదగ్గరౌతున్నకొద్దీ కాంతారావుకి ఏవేవో గుర్తుకు రావటం మొదలు పెట్టాయి.

2

రైలుబండి, సమానాంతర రేఖలు సరిగా వున్నంతకాలం బాగానే నడుస్తుంది.

సరిగ్గా యిదే జరిగింది రాజయ్య విషయంలో.

రాజయ్యను గురించి బంధుకోటిలో తలకొక అభిప్రాయం వున్నమాట నిజమే. దాని నిజానిజాలు యిప్పుడు విచారించటం వల్ల చనిపోయిన రాజయ్య ఆత్మకి శిక్ష కాని, భిక్ష కాని ప్రసాదించగలదా ఈ సంఘం!

కాంతారావుకి తెలిసిందల్లా రాజయ్య బంధుప్రియుడు అన్నమాటే. ఆయనతో పరిచయమల్లా తనకు, తన చిన్నతనంలోనే. తను పెద్దవాడై లోకాన్ని అర్థం చేసుకునేస్థితికి వచ్చేటప్పటికి రాజయ్య పాత్ర ఈ విశ్వరంగంమీదనుంచి నిష్క్రమించింది.

మరీదారుణమైన విషయమేమిటంటే, చిరకాలం సుఖశాంతులతో గడిపిన రాజయ్య కుటుంబం చూస్తూవుండగానే చితికిపోయింది అన్ని విధాలా.

బి. ఏ. చదివిన పాతికేళ్ళకొడుకు పోయాడు, పక్షవాతంలో తీసుకు తీసుకు.

కొడుకు చనిపోవటంతో పట్టిన శనితో ఉన్న పొలం కాస్త అమ్మేయాల్సొచ్చింది రాజయ్యకి.

చేతికెదిగిన కొడుకు తన్ను నిస్సహాయుణ్ణిగా చేసిపోయాడని విలపించాడు రాజయ్య. వాడి చేతులలో తరించవలసిన తన కట్టె, నేడు వాడి సర్వస్వానికే నిప్పుపెడుతోంది. ఇంత వయసువచ్చిన తన్ను బ్రతికించి, పసివాణ్ణి తన కొడుకును తీసుకుపోకపోతే ... రాజయ్యకు దుఃఖం పొర్లుకొచ్చింది. వాడు తన కొడుకు; వాడు తనకి కొరివిపెట్టాలి. కాని – తనే వాడికి కొరివిపెడుతున్నాడు! కాదు–వాడే తండ్రి, తనే కొడుకు, తనే వాడికి కొరివిపెడుతున్నాడు.

ఒక విధంగా ఇదికూడా నిజమే.

రాజయ్య తండ్రే రాజయ్యకి కొడుకుకూడా అయ్యాడు. ఒకే రాజయ్య ఇద్దరు తండ్రు లకి తలకొరివి పెట్టాడు.

స్మశానంలో కాలుతున్న కొడుకు స్థితిని చూచి, రాజయ్య అనుకున్న మాటలివి.

అప్పట్నుంచి రాజయ్య ఈ ప్రపంచం ముఖం చూడలేకపోయ్యాడు కొంతకాలం.

చచ్చినవాళ్లతో చస్తారా!

చచ్చినవాళ్లు మళ్లీ వస్తారా!

అదీలేదు - ఇదీలేదు.

రాజయ్యగుండె రాయిచేసుకున్నాడు' చేసుకోవటంకాదు. దానంతట అదే అయింది.

మళ్ళీ రాజయ్య మామూలుగా జీవించటం మొదలు పెట్టాడు. ఇప్పుడు రాజయ్య కుటుంబం పూర్వంలా ఉచ్ఛ స్థితిలోలేదు.

అది ఇంకిపోతున్న చెరువు. ప్రపంచంలో కష్టసుఖాలు ఎవరికీ చెప్పిరావు. దుర్బలుడైన మానవుడు కాలం చేతులో కీలుబొమ్మ.

ఈ చిన్న సత్యాన్ని తరచి చూడటానికి రాజయ్య కుటుంబచరిత్ర ఒక తార్కాణం.

♦ ♦ ♦

రాజయ్య రెండో కొడుకు విశ్వనాథానికి పెళ్ళి అయింది. మూడో కొడుకు నారాయణ చదువుకుంటున్నాడు ఆ వూళ్ళోనే మిడిల్ స్కూల్లో.

అప్పటికి విశ్వనాథం సెంకడరీ గ్రేడ్ ట్రైనింగ్‌ప్యాసై ఒక ఎయిడెడ్ స్కూల్లో అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు.

రాజయ్య తన పెద్దకొడుకు వీడేననుకో గలిగాడు మనసులో. మళ్ళీ మోడు వారిన జీవితాలు మోసులువేశాయి అను కున్నాడు.

రాజయ్య పెద్దకోడలు పంకజం భర్త చనిపోయిన తర్వాత పుట్టింటికి చేరింది. అసలామె కాపురంచేసి ఏడ్చింది ఎక్కడ!

జీవితంలో వసంతమంటే ఏమిటో ఎరగని పంకజం తల్లిదండ్రుల పంచని పడి బ్రతకటమే పరమావధి అనుకుంది తన బ్రతుక్కి.

చెట్టుకి కాయలు బరువుకాదు.

పంకజం చెట్టున కాసిన ఒక కాయ— అది చెట్టునే పండి రాలి పోవాలి. అంతే రాసివుంది పంకజం నుదుటిమీద.

ఒకటి రెండుసార్లు రాజయ్య పంకజాన్ని తన ఇంటికి తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు. కాని అది అప్పటికీ, ఎప్పటికీ సాగలా.

ఈ విషయంలో రాజయ్యకీ, పంకజం తల్లి దండ్రులకి మనస్పర్థలుకూడా రాక పోలేదు.

ఎవరి కడుపుమంట వాళ్ళు వెళ్ళగక్కారు.

చివరికి రాజయ్యా అన్నాడు; 'చచ్చి నా కొడుకు సాధించాడు—బ్రతికి నా కోడలు సాధిస్తుంద'ని.

ఇవి రాజయ్యా ఆత్మ పరీక్ష చేసుకొని అన్నమాటలు కావు. కాని అది అతనికి అప్పుడు తెలియలేదు.

రాజయ్యాకి బాగా ముసలితనం వచ్చింది. సంసారంలో బాధ్యతలు పెరుగుతుండటం వల్ల అప్పులబాధ ఎక్కువైంది. ఇంత వరకూ రాజయ్యా ఎట్లా సంపాదించి సంసారం వెళ్లదీశాడో ఎవరికీ తెలీదు. అసలతను అంత తేలిగ్గా తొణికేమనిషి కాడు.

♦ ♦ ♦

హటాత్తుగా రాజయ్యా మరణాన్ని గురించి ఊళ్ళో తలకొక విధంగా అనుకోవటం మొదలుపెట్టారు.

'మంది కొంపలు ముంచాడు. ఆయనకేం! వెలిగినంతకాలం బాగానే వెలిగాడు.'

'కాని...పాపం చావు తుదకు మహాయాతన అనుభవించాడు. చెట్టంత కొడుకు పోయాడు. అంత కంటె దురదృష్టమింకేముంటుంది ?'

'అయినా చేసుకున్న వారికి చేసుకున్నంత! ధర్మాత్ముడు. ఊరికంతటికీ, పెద్ద పులిలా వుండేవాడు, అంతటి మహారాజుకి ఎంతటి దశా'

'అయినా ఎంత యిది కాకపోతే అంత ఘోరమైన చావు చస్తాడు!'

జనవాదం పరంపరలుగా బయలుదేరింది రాజయ్యా చావును గురించి దీనికంతటికీ, అందరికీ తెలిసిన కారణం ఒక్కటే.

రాజయ్యా ఆత్మహత్య చేసుకున్నాడన్నారు అతని శరీరం కాలవలో దొరకటంచేత.

రాజయ్యా ఊరినిండా అప్పులు మిగిల్చిపోవటంచేత, తీర్చేవిధం లేక, ఊళ్లో ముఖమెత్తుకు తిరగలేక, ఆత్మహత్య చేసుకున్నాడన్నారు బాకీదార్లు.

విశ్వనాథం సంపాదన ఇల్లుగడవటానికే అంతతమాత్రంగా వుంది.

ఉన్న ఆస్థిలోసగం మొదట్లో పెద్ద కొడుకు చదువులకీ, తరువాత వాడి పక్షవాతానికి ఖర్చుపెట్టాడు. కాని ఫలితం దక్కలేదు.

వేరే సంపాదనలేని రాజయ్యా సంసారాన్ని పోషించటానికి మిగిలిన కొద్ది ఆస్థి తప్ప వేరే మార్గమేముంది ?

పుట్టినప్పట్నుంచి మహారాజ పోకిళ్లతో పెరిగిన రాజయ్యా పెద్దకొడుకు చనిపోయేదాకా డబ్బును మంచినీళ్ల క్రిందే ఖర్చు చేశాడు. కొడుకు చనిపోయేటప్పటికి, తన కున్న ఆస్థిని చూపి వాడి చదువుకోసం,

జబ్బుకోసం చేసిన అప్పులు పర్వతాల్లా పేరుకుపోయాయి.

చెరువు ఎండితేగాని, చేపలు బయట పడవు. రాజయ్యచావుతో ఆ కుటుంబం పుట్టు పూర్వోత్తరాలు బయటపడ్డాయి.

ఏది ఎట్లావున్నా రాజయ్య పేరవున్న కొరదలా ఆస్థి అంతా అమ్మగారూపాయికి పావలాలు మాత్రం దక్కాయి పెట్టుబడి పెట్టిన ఆసాములకి.

♦ ♦ ♦

రాజయ్య చనిపోయి ఏడాదయింది.

విశ్వనాథం ప్రయోజకుడయ్యాడు. అత నిప్పుడు ఆ స్కూలుకి హెడ్మాస్టరై హోదాకి తగ్గ సంపాదనే ఆర్జిస్తున్నాడు.

నారాయణ స్కూలు ఫైనలు చదువుకి వచ్చాడు.

వాడ్ని పట్నం పంపి కాలేజీలో చదివించాలని విశ్వనాథం ఆశయం. అది నెరవేర టానికి అతనెంతో కృషి చేస్తున్నాడు.

ఉదయం పదిన్నరదాకా స్కూలు, మధ్యాహ్నం పిల్లలకి ప్రైవేటు చెప్పటం, మళ్ళీ మధ్యాహ్నం బడి. సాయంత్రం ఐదు గంటలనించి ఇంటి ముందున్న బడి తోటలో పనితో సాయంత్రం ఎనిమిది గంటలదాకా వంచిన నడుం ఎత్తడు. మళ్ళీ రాత్రి పది పన్నెండు గంటలదాకా ఏదో చదువు.

ఇంత చేస్తున్నా తను ప్రయత్నంలో ఏదో పెద్దలోపం చేస్తున్నానని అసంతృప్తిగా బాధ పడతాడు విశ్వం.

భార్య రాజేశ్వరి చాలా చిన్నది. పాతికేళ్ళైనా నిండని విశ్వనాథం ఇంత పెద్ద భారాన్ని మోయటం ఆమెకు అంత ఇష్టంగావుండేదికాదు. అక్కడకీ విశ్వనాథం చాలావరకు రాజేశ్వరి మనసు తెలుసుకొని మసలుతుండేవాడు.

ఒకరోజు రాత్రి పన్నెండు గంటలకి పక్కచేరిన విశ్వనాథాన్ని అడిగింది రాజేశ్వరి.

'మీరు రాత్రింబగళ్లు ఇంత కష్టం ఎందుకు పడాలి ?'

దాని అర్థం విశ్వనాథానికి తెలియలేదు.

'అంటే'

'మీఆరోగ్యంకూడా లెక్కచేయకుండా, కాస్తన్నా విశ్రాంతితీసుకోకుండా ఎప్పుడూ ఏడా తెరిపిలేకుండా ఏదో పనిచేస్తూనే వుంటారే.. అసలే మీదొళ్లు మంచిదికాదు. తరువాత ఏమనుకున్నా ఏంలాభం!' అంది భయపడుతూనే.

'ఓసీ పిచ్చిదానా ! మనమీద అమ్మా, తమ్ముడూ ఎన్ని ఆశలు పెట్టుకున్నారో నీకేం తెలుసు! కన్నందుకు అమ్మనీ, తోడుగా పుట్టినందుకు తమ్ముడ్నీ మనమాదరించకపోతే యింకెవరాదరిస్తారు ?' అన్నాడు ఆమె కళ్లలోకి చూస్తూ చిరునవ్వుతో విశ్వనాథం. (సశేషము)